క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే, నాయకులు

కామేపల్లి: తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించగా.. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తీరిన విద్యుత్ సమస్య

కూసుమంచి: మండలంలోని లింగారంతండాలో లోఓల్టేజ్ సమస్య నెలకొనగా గ్రామానికి చెందిన పలువురు నాయకులు సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాలతో గ్రామంలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం అధికారులు ఏర్పాటు చేయగా.. పనులను ఏడీఈ కోక్యానాయక్ పర్యవేక్షించారు. తమ సమస్యను తీర్చినందున మంత్రికి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏన్కూరు: ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జాతీయ మానవహక్కుల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డుపాటి దాసు కోరారు. స్థానిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ మహిళ విభాగం అధ్యక్షురాలు ఎనుమల రుక్మిణి, చిన ఏసు, రమణ, తహసీల్దార్ శేషగిరిరావు, బ్యాంకు మేనేజర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన నేలకొండపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని కోదాడకు చెందిన ఎం.ఉపేందర్, నాగేశ్వరరావులు మంగళవారం ఖమ్మం నుంచి కోదాడ బైక్‌పై వెళ్తున్నారు. ఈక్రమంలో నేలకొండపల్లిలోని బస్టాండ్ దగ్గరకు రాగానే ఓ కారు యూ టర్న్ చేస్తుండగా ప్రమాదం జరిగి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి ఖమ్మంకు తరలించారు.

దుప్పట్ల పంపిణీ

కామేపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: కామేలిపల్లి మండలంలోని ముచ్చర్ల ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలో ఖమ్మం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన 70 మంది విద్యార్థులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెలిగోటి చంద్రమోహన్ మాట్లాడగా.. కార్యక్రమంలో కార్యదర్శి గుడిమళ్ల సూర్యప్రకాశ్‌రావు, కేదాసు నర్సయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, రాఘవయ్య, వసతి గృహ సంక్షేమాధికారి వేణు తదితరులు పాల్గొన్నారు.

జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 43వ డివిజన్ రేవతిసెంటర్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు డ్రెయినేజీని బ్లాక్ చేయడంతో కేఎంసీ సిబ్బంది సదరు యాజమాన్యానికి రూ.10వేల జరిమానా విధించారు. డ్రెయినేజీలను బ్లాక్ చేసినా, వ్యర్థాలు నింపిన సంబంధితులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ఎస్‌ఐ భీమయ్య, జవాన్ శివారెడ్డి పాల్గొన్నారు.

'వికాస్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: ఇటీవల స్టార్ డ్రాగన్ క్లబ్ ఆధ్వర్యాన ఖమ్మంలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని వికాస్ పాఠశాల కరస్పాండెంట్ వై.లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.. అండర్–14 బాలుర, బాలికల విభాగాల్లో టి.రిషిక్ శ్రీహాస్, నాగ శ్రీనిజ, మోక్షశ్రీ పతకాలు సాధించారన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

ఖమ్మంవన్‌టౌన్: అంధుల పాలిట దైవం లూయిస్ బ్రెయిలీ అని 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మగ్బూల్ అన్నారు. మంగళవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను పురస్కరించుకుని నగరంలోని పాకబండబజార్ పార్క్‌లో లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడగా.. కార్యక్రమంలో జ్యోతి నివాస్ ప్రత్యేక పాఠశాల అంధులైన బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన షురూ..

కేఎంసీలో పనిచేయని సిబ్బందిపై నజర్

- ఇప్పటికే ఇద్దరిని తప్పిస్తూ నిర్ణయం
- మరో నలుగురి విభాగాల మార్పు
- పైరవీల బాటలో సిబ్బంది



ఖమ్మంమయూరిసెంటర్: ఏళ్ల తరబడి కార్యాలయంలో పాతుకుపోయి.. విధులు నిర్వర్తించకుండా కాలయాపన చేస్తూ ఖమ్మం నగర పాలక సంస్థకు భారంగా మారుతున్న సిబ్బందిపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శానిటేషన్ విభాగంలో చేరిన కొందరు తమ పైరవీలతో కార్యాలయంలోకి విధులు మార్చుకున్నారు. దీంతో కేఎంసీలో పని చేసే వారి సంఖ్య కన్నా ఖాళీగా తిరిగే వారే అధికంగా ఉందన్న విమర్శలు వచ్చాయి. అధికారులకు, వారి అసిస్టెంట్‌లకు అసిస్టెంట్‌లుగా చలామణి అవుతూ కార్యాలయంలో ఖాళీగా తిరగడమే కాక పలు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెండు నెలల క్రితమే కేఎంసీలో సిబ్బందిని ప్రక్షాళన చేసేందుకు అధికారులు సన్నాహాలు చేసినా వరదలు, ఆ తర్వాత సర్వేల పేరుతో అధికార యంత్రాంగానికి తీరికలేకుండా పోయింది. ప్రస్తుతం పనులన్నీ కొలిక్కి వస్తుండడంతో ఖాళీగా ఉన్న సిబ్బందిపై ప్రక్షాళన షురూ అయింది.

నిశితంగా పరిశీలిస్తూ..

క్షేత్ర స్థాయిలో పని చేసే కార్మికులు, జవాన్ల దగ్గర నుంచి కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేసే రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై అధికారులు నజర్ పెట్టారు. వారి పని విధానంతో పాటు సిబ్బంది ఎవరు ఎవరి వద్ద పని చేస్తున్నారు..? వారికి హాజరు ఎవరు ఇస్తున్నారనే అంశాలను కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈనేపథ్యాన ఇటీవల పలు ఆరోపణలు వచ్చిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తప్పిస్తూ కమిషనర్ నిర్ణయించినట్లు తెలిసింది. దీనిలో భాగంగా మెప్మా అధికారులకు సదరు సిబ్బందికి వేతనాలు చెల్లించొద్దని సూచిస్తూ లేఖను కమిషనర్ పంపినట్లు తెలిసింది.

సంక్రాంతి తర్వాత..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో సిబ్బంది పని తీరుపై దృష్టిపెట్టిన అధికారులు వారిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. సంక్రాంతి పండుగ తర్వాత ఈ ప్రక్షాళనను వేగవంతం చేయనున్నట్లు సమాచారం. శానిటేషన్ విభాగంలో విధుల్లోకి చేరి క్షేత్రస్థాయిలో పనులు చేయకుండా కార్యాలయంలోకి వచ్చిన వారిలో మరికొంత మంది సిబ్బందిని అంతర్గత బదిలీలు చేయడం, అవసరమైతే వారిని తిరిగి పారిశుద్ధ్య పనులకు పంపించేందుకు చర్యలు చేపడతున్నట్లు తెలిసింది.

అంతర్గత బదిలీలు..

కేఎంసీ కార్యాలయంలో పలు విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈనేపథ్యాన

- టౌన్ ప్లానింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.రవిను ఆర్టీఐ, ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన, ఆసరా పెన్షన్ విభాగానికి మార్చారు.
- మున్సిపల్ ఈఈ వద్ద అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.ఐలేశ్‌ను కమిషనర్ చాంబర్ వద్ద అటెండర్‌గా బదిలీ చేశారు.
- కమిషనర్ వద్ద అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.ప్రసాద్ (ఔట్‌సోర్సింగ్)ను మెప్మా పీడీ అటెండర్‌గా మార్చారు.
- పబ్లిక్ హెల్త్‌వర్కర్ బి.నాగేశ్వర సాయినాథ్‌ను మున్సిపల్ ఈఈ వద్ద అటెండర్‌గా బదిలీ చేశారు.
- రెవెన్యూ సెక్షన్ అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పబ్లిక్ హెల్త్‌వర్కర్ జి.మాధవిని శానిటేషన్‌కు మార్చారు.

మొదలైన పైరవీలు..

కార్యాలయంలో ఖాళీగా తిరుగుతూ, అసిస్టెంట్‌లుగా చలామణి అవుతున్న సిబ్బంది మళ్లీ పైరవీల బాటపట్టినట్లు తెలుస్తోంది. ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై అధికారులు చర్యలకు ఉపక్రమించగానే.. వారికి ఉన్న అధికార, ప్రజాప్రతినిధుల అండదండలను ఉపయోగించుకొని అదే స్థానంలో ఉండేలా పైరవీలు చేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒకరిద్దరు పైరవీలను చేయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు సైతం తమకు అనుకూలంగా ఉన్న సిబ్బంది కోసం అధికారులతో మాట్లాడే ప్రయత్నాలు చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

కేఎంసీ కార్మికులకు ప్రమాద బీమా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేసే పారిశుద్ధ్య విభాగం కార్మికులు, సిబ్బందికి ఇన్సూరెన్స్ చేయిస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మంగళవారం కేఎంసీ కార్యాలయంలో కార్మికులకు ప్రమాద బీమా రిజిస్ట్రేషన్ చేస్తున్న విధానాన్ని డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహర ముక్తార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 700 మంది సిబ్బందికి కేఎంసీ తరఫున ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యాన ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి యోజన బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులపై కమిషనర్ ఆరా


సిబ్బందిపై చర్యలకు ఆదేశిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 21వ, 22వ, 45వ, 50వ డివిజన్లలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈనేపథ్యాన 21వ, 22వ డివిజన్లలో స్వీపింగ్ మిషన్‌తో రోడ్లను శుభ్రం చేస్తున్న పనులు, 45వ డివిజన్‌ను సందర్శించి వివిధ పనుల వివరాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈనేపథ్యాన 50వ డివిజన్‌లో పర్యటించినప్పుడు పలు ప్రాంతాల్లో రోడ్ల వెంట వ్యర్థాలను చూసి అసహనం వ్యక్తం చేసి తక్షణమే వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏ డివిజన్‌లో అపరిశుభ్రంగా రోడ్డు పక్కన వ్యర్థాలు ఉంటే ఆ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే బాధ్యత అని హెచ్చరించారు. కమిషనర్ డివిజన్లలో పర్యటించిన సమయంలో స్థానికంగా లేని ఇద్దరు 21వ, 50వ జవాన్లకు మెమోలు ఇవ్వాలని కమిషనర్ అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించినట్లు సమాచారం.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనేపథ్యాన నగరంలోని దానవాయిగూడెం సబ్ స్టేషన్ 11 కేవీ వాటర్ వర్క్స్, రాజీవ్ గృహకల్ప ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పద్మావతినగర్, ఎఫ్‌సీఐ, ఆటోనగర్, మేకల నారాయణనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఎన్నెస్పీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వైరారోడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఎల్ఐసీ ఆఫీస్, సీపీఎం ఆఫీస్ ఏరియా, రేవతి సెంటర్ ప్రాంతం, వైరారోడ్ పరిధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

బస్ డిపో రోడ్డును వెడల్పు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకంగా మారిన ఖమ్మం బస్సు డిపోరోడ్డును వెంటనే 80 అడుగుల వెడల్పు చేయాలని ఖమ్మం సీపీఎం పార్టీ టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం డిపో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడుతూ మయూరిసెంటర్ నుంచి బైపాస్‌రోడ్ వరకు గల డిపో రోడ్డు మధ్య గల డివైడర్లతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులకు ఇబ్బందవుతుందని, వెంటనే రోడ్డును వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పు లేక ఏదైనా కుటుంబం నష్టపోతే తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు చింతల రమేష్, ప్రవీణ్, యర్రా మల్లికార్జున్, వెంకన్నబాబు, భద్రం, డి.వీరబాబు, భుక్యా ఉపేంద్రనాయక్, మచ్చా సూర్యం, పి.నాగేశ్వరరావు, హుస్సేన్, వాసు, సుధాకర్, మల్లికార్జున్‌రెడ్డి, గుమ్మడి భిక్షం, బాబు తదితరులు పాల్గొన్నారు.

9న కలెక్టరేట్ ఎదుట ధర్నా

తిరుమలాయపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులకు మద్దతు ధర ఇవ్వాలని, ఎంఎస్‌పీని చట్టబద్ధం చేయాలని తదితర డిమాండ్లపై ఈ నెల 9న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి మలీదు నాగేశ్వరరావు అన్నారు. ఈమేరకు మంగళవారం పిండిప్రోలులో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలని, భూమిలేని వారికి భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని నిర్వహించే ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, మారుతి మల్లయ్య, బానోతు శంకర్, సోమనపల్లి వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకయ్య, బండి వీరయ్య, రాయిండ్ల సుధాకర్, కత్తుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో నిరంతరం విద్యుత్ సరఫరా

రఘునాథపాలెం: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ఉండేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం విద్యుత్ ఏడీ పరిధిలో ఏడు సబ్‌స్టేషన్లు ఉండగా.. నాలుగు సబ్‌స్టేషన్లకు ప్రత్యేక లైన్లు వేస్తున్నట్లు ఏడీ సంజయ్‌కుమార్ తెలిపారు. ఏడీ పరిధిలో ఇప్పటికే మంచుకొండ, ఈర్లపుడి, పంగిడి సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ లైన్లు ఉన్నాయన్నారు. సుమారు రూ.1.20 కోట్ల ఖర్చుతో కోటపాడు, బావోజితండా, రఘునాథపాలెం, నగరంలోని పారిశ్రామిక ప్రాంతంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లకు లైన్లు వేయాల్సి ఉండగా.. గత రెండు రోజులుగా రఘునాథపాలెం సబ్‌స్టేషన్‌కు లైన్ లాగుతున్నారు. మంగళవారం జరుగుతున్న పనులను ఏడీ సంజయ్‌కుమార్, ఏఈ జె.శంకర్‌లు పరిశీలించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కరుణాకర్

తిరుమలాయపాలెం: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని, అందుకు నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేయాలని హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి'అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా యువజనోత్సవాలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు బహుమతులు అందజేశారు. అవినీతికి వ్యతిరేకంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు విచార్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సతీష్ ఖండెల్వాల్ అందించిన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు స్టూడెంట్ కౌన్సిలర్ శ్రీధర్‌కుమార్, లలిత, వీరాస్వామి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న పువ్వాళ్ల, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని జనవరి 26 నుంచి ప్రారంభిస్తామని సీఎం రేవంత్ ప్రకటించడంతో మంగళవారం జిల్లా కాంగ్రెస్ ఆఫీస్‌లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.85వేల కోట్లు రైతులకు ఖర్చు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.53వేల కోట్లు ఖర్చు చేసి రైతును రాజును చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, ఐఎన్‌టీయూసీ ఎండీ వై పాషా, బాణాల లక్ష్మణ్, ఏలూరి రవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి


శంకరగిరితండా నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను పరిశీలించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ సర్వేను చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీల్లో మొక్కల పెంపక పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి పాతవాటి స్థానంలో నూతనంగా కన్వర్షన్ కోసం మొక్కలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కూలీలకు పని దినాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న నేపథ్యాన పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హత్య హేయమైన చర్య


నిరసనలో టీజేఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: జాతీయ మీడియా జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్‌ను పాశవికంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే, టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీలో భాగంగా జర్నలిస్ట్ హత్యను నిరసిస్తూ మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్, మందుల ఉపేందర్, టీఎస్ చక్రవర్తి, నాగరాజు, షేక్ జానీపాషా, శ్రీధర్ శర్మ, అమరవరపు కోటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుద్దేటి రమేష్‌బాబు, కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను బలపర్చండి


ఫండ్ క్యాంపెయిన్‌లో రాజు, తదితరులు

కూసుమంచి: సీపీఎం ఆధ్వర్యాన చేపట్టే ప్రజా ఉద్యమాలను బలపర్చాలని పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ ఫండ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నాయని, ఇందుకు పోరాటాలే శరణ్యమన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న సీపీఎం ఎల్లవేళలా ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తుందని, పేద, మధ్య తరగతి ప్రజలపక్షాన నిలిచి అనేక సేవా, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శీలం గురుమూర్తి, కర్ణబాబు, గన్యానాయక్, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సంఘ ఎన్నికల్లో ఎలమందల జగదీష్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. రోటరీనగర్‌లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించాక సంఘం ఆధ్వర్యాన నగరంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సురభి సైదులు, శ్రీరాముల విజయ్, అద్దంకి పాపారావు, సురభి సందీప్, కొలిపాక రాఘవేందర్, యలమందల శీను, దోమకొండ నాగేశ్వరరావు, శ్రీపతి రామనాథం, కోటయ్య, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 19న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింతా బాబు మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ లంక వెంకటేశ్వర్లు, ఎల్‌వీఆర్ మాదిగ కోరారు. మంగళవారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా కమిటీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని, వెంటనే ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త పింఛన్‌లు ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో భోజన సదుపాయాలు, విద్య, ఆరోగ్య సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.నరసింహ, మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు మేళ్లచెరువు నాగమణి, విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు కర్ణ ఉపేందర్, జిల్లా నాయకులు కుర్రి నరసింహ, ఇరుకు కృష్ణ, గుర్రం సంగయ్య, పడిశాల నాగేశ్వరరావు, నరపాంగు ఉపేందర్, ఉసికల శ్రీనివాసరావు, వంశీ, బొడ్డు రాము తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ తీర్థయాత్ర కార్యాలయం ప్రారంభం

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి బిషప్ హౌస్‌లో జెరుసలేం తీర్థయాత్రకు సంబంధించిన కార్యాలయాన్ని ప్రొక్టేటర్ ఫాదర్ ఐజాక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెరూసలేం యాత్రకు వెళ్లే విశ్వాసుల సౌకర్యార్థం దీన్ని ప్రారంభినట్లు తెలిపారు. యాత్రలో భాగంగా ఇజ్రాయెల్ దేశంతో పాటు ఈజిప్ట్, పాలస్తీనా, జోర్డాన్ దేశాల్లోని పవిత్ర స్థలాలను చూపిస్తూ ఈ యాత్ర ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాచర్ల శేఖర్‌బాబు, బ్రదర్‌లు కరుణాకర్, ప్రభాకర్, రాఘవులు, చార, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ వద్ద బీజేపీ ధర్నా

నేలకొండపల్లి: ఎన్నికల హామీల్లో భాగంగా రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో చేసిన డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన, బీసీ కమిషన్ ఆధారంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ పెంచుతామన్నారని, బీసీ సంక్షేమం కోసం రూ.20 వేల కోట్లు కేటాయింపు చేయాలని కోరారు. అలాగే పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, ఎస్‌కె.షర్ఫుద్దీన్, మండల కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, నరసింహారావు, బాజా రామకృష్ణ, సాయి, హర్ష, గోపి, నాగచారి, పి.దివాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షేమ గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గురుకులాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యాన డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధిర కిష్టాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి ఎం.సాయివర్ధన్ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. నాణ్యత లేని కారణంగా విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారని, గురుకులాల హాస్టళ్లను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. వినతి అందించిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగుల్‌మీర, శివనాయక్, గౌతమ్, జిల్లా నాయకులు రవి గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'అన్నం' సేవలు

- అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల ఖమ్మం రైల్వే పోలీస్‌ల పరిధిలోని పందిళ్లపల్లి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని ఓ వృద్ధుడు(60) రైలు ప్రమాదంలో మృతి చెందగా ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. అలాగే ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బిహార్‌కు చెందిన వలస కూలీ మద్రాసు నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో రైల్లో మృతి చెందగా.. ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. అంతేకాక గత వారం రోజులుగా మార్చురీలో ఉన్న మరో మృతదేహం ఉండగా వైద్యశాల సిబ్బంది, ఓపీ పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మార్చురీలోని మూడు అనాథ శవాలను స్వాధీనం చేసుకుని బల్లేపల్లి వైకుంఠధామంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ బాధ్యులు అన్నం అమరేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆరేళ్ల తర్వాత కుటుంబం చెంతకు..

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి గత ఆరేళ్ల క్రితం తప్పిపోయిన ఓ వ్యక్తి మంగళవారం కుటుంబసభ్యుల చెంతకు చేరాడు. 2019 సంవత్సరంలో కరోనా సమయాన రోడ్డుపై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న 46 ఏళ్ల ఓ వ్యక్తిని చేరదీసి అన్నం సేవా ఫౌండేషన్‌కు తరలించి వైద్యులచే చికిత్స అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. అయితే గత మూడు రోజుల క్రితం తన పేరు తుల్జారామ్, తండ్రి తుక్కప్ప, ఊరు కాసింపూర్ అని చెప్పడంతో సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పోలీసులను ఫౌండేషన్ వారు సంప్రదించారు. దీంతో సదరు వ్యక్తి బంధువులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించగా.. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో వైద్యం చేయించినట్లు తెలిపాక కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, తుల్జారామ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.


మృతదేహాల వద్ద ఫౌండేషన్ బాధ్యులు

విస్తృతంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు


ఖమ్మంక్రైం: అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐలు

తిరుమలాయపాలెం/కూసుమంచి/ఖమ్మంసహకారనగర్/ఖమ్మంక్రైం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ నేపథ్యాన హెల్మెట్ వినియోగంపై తిరుమలాయపాలెంలో ఎస్ఐ కూచిపూడి జగదీష్, కూసుమంచిలో ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యాన, ఖమ్మంలో సర్వజ్ఞ పాఠశాల ఆధ్వర్యాన నిర్వహించిన వారోత్సవాల్లో ఎస్ఐ సాగర్‌బాబు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వారిని ఆపి, వారికి దాని ప్రాధాన్యతను వివరించడంతో పాటు పలువురికి హెల్మెట్లు అందజేశారు. పరిమితికి మించి కూలీలతో వెళ్తున్న ఆటోలను ఆపి కూలీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఐ –2 శ్రీధరాచారితో పాటు కానిస్టేబుళ్లు వీరస్వామి, వెంకటేశ్వర్లు, సర్వజ్ఞ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు. కాగా, బైపాస్‌రోడ్డులో ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ ఆధ్వర్యాన జేసీబీ డ్రైవర్లకు రవాణాశాఖాధికారులు అవగాహన సదస్సు నిర్వహించగా.. ఏఎంవీఐలు స్వర్ణలత, గోపికృష్ణ, సుమలత, కానిస్టేబుళ్లు రమేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.